జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
బుధవారం | 31 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 3

## నేడు జిల్లాలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి పర్యటన



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి జిల్లాలో నేడు పర్యటిస్తారు.తొలుత మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో కలిసి నగరంలోని ఎస్సార్ గార్డెన్స్ లో పాలేరు నియోజకవర్గ పరిధి గ్రామపంచాయతీల పాలకవర్గాల అభినందన సభకు హాజరవుతారు.ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లాలో పలు ప్రైవేట్ కార్యక్రమాలకు వెళ్ళనున్నారు.



## రైతులకు న్యాయమైన రుణ పరిమితులు నిర్ణయించడమే లక్ష్యం

- రైతులకు మరింత మేలు చేసే వైవిధ్యమైన పంటలను ప్రోత్సహిస్తూ రుణ విధానాలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటల వారీగా రుణ పరిమితుల ఖరారు
- ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నందు 2026–27 సంవత్సరానికి వ్యవసాయ రుణాల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి:** స్థానిక వ్యవసాయ ఖర్చులు ఏటేటా పెరుగుతున్న క్రమంలో రైతులకు వాస్తవికంగా, న్యాయంగా రుణ పరిమితులు నిర్ణయించాల్సిన అవసరం ఉందని, రైతులకు సహకార బ్యాంకులే ఆర్థికంగా ప్రధాన ఆధారంగా నిలవాలని డిసిసి బ్యాంక్ పర్సన్ ఇంచార్జ్ చైర్మన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో 2026–27 సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (Scale of Finance) నిర్ణయాలపై డిసిసి బ్యాంక్ పర్సన్

మిగతా 2 లో...

## నిబంధనల ప్రకారం సర్వే పనులను జనవరి 15 వరకు పూర్తి చేయాలి...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- ప్రజల దరఖాస్తులను అనవసరంగా తిరస్కరించ వద్దు
- ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర నివేదిక అందించాలి
- భూ సర్వే పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** స్థానిక నిబంధనల ప్రకారం సర్వే పనులను జనవరి 15 వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భూ సర్వే పనులపై మండలాల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ భూ సేకరణ పూర్తి చేయడంలో సర్వే శాఖ కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులు అన్ని సైతం సర్వే సరిగ్గా చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. మండలాల వారీగా సర్వేయర్ పని తీరుపై సర్వే ల్యాండ్ రికార్డ్స్

మిగతా 2 లో...





## కల్లూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఏసీపీ వసుంధర యాదవ్

2 లో..



## నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు

2 లో..

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మంత్రిని కలిసిన తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ

## పేద జర్నలిస్టు కుమార్తెకు విద్యా ప్రోత్సాహకం అందించిన ఆర్యవైశ్య సంఘం



**వేంసూరు,డిసెంబర్30( ప్రజాజ్యోతి):** వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో నివసించే పేద జర్నలిస్టు మల్లూరు చంద్రశేఖర్ కుమార్తె సత్య సృజన చదువు కోసం ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న విషయం మండల ఆర్యవైశ్య సంఘం నేతలు ఇటీవల తెలుసుకున్నారు.వారు స్పందించిమంగళవారం మల్లూరు నివాస గృహం వద్దకు మండల అధ్యక్షులు నడిపల్లి వాసుదేవరావు (చిన్నబుజ్జి) ఆధ్వర్యంలో వెళ్లి విద్యా ప్రోత్సాహక బహుమతిగా ఐదు వేల పది రూపాయల ఆర్థిక సాయాన్ని చంద్రశేఖర్,తన సతీమణి వెంకటేశ్వరిల చేతులకు అందించారు.నిజమైన వార్తలు రాస్తూ సమాజాన్ని మెల్కొల్పుతూ ముందుకు సాగుతూ జీవించడం ఆదర్శప్రాయమని చిన్నబుజ్జి స్పష్టం చేశారు.ఆర్యవైశ్య సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తమ ఇబ్బందులను గుర్తించి సాయం చేసిన ఆర్యవైశ్య నేతలకు జర్నలిస్టు మల్లూరు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.ప్రశ్నించే పెదవులకు,వెలుగెత్తి నిజాన్ని నిర్భయంగా చాటే కలానికి సాయం చేయడం చాలా సంతోషంగా ఉందని రుణపడి ఉంటామని మల్లూరు దంపతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో: మండల వైస్ ప్రెసిడెంట్ పసుమర్తి శ్రీనివాసరావు,సీనియర్ నాయకులు కొణిజర్ల వెంకటేశ్వరరావు,కొణిజర్ల రాంబాబు,యశోద హరిరామకృష్ణ,కొత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసి భాగం



**కల్లూరు డిసెంబర్ 30 ప్రజా జ్యోతి :**కల్లూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన మేడూరి రామచంద్రరావు ను కల్లూరు మండల వ్యవసాయ మార్కెట్ ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మరియు కల్లూరు మండల కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల యూత్ అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ, భాగం ప్రభాకర్ చౌదరి, పెద్ద బోయిన శ్రీనివాసరావు, కంభంపాటి పుల్లాచారి, పొన్నూరు వెంకటేశ్వర్లు, పసుపులేటి శ్రీనివాసరావు, నోటి కృష్ణారెడ్డి, తోట సుబ్బారావు, బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కమిషనరేట్ ప్రజలకు

## ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ సూచనలు

### ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ




ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలు కుటుంబ సభ్యులతో సంతోషం గా జరుపుకోవాలని కోరుతున్నాము.యువకులు బైక్ మీద ప్రమాదకర విన్యాసాలు, అతి శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకి గురి చేయవద్దు.చేస్తే అటువంటి వాహనాలు స్వాధీనం చేసుకోబడతాయి.నూతన సంవత్సర వేడుకలు కారణం గా ఖమ్మం నగరం నలు మూలల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుంది. కావున మద్యం సేవించి వాహనాలు నడపరాదు. మద్యం సేవించి పోలీసులకి దొరికిన యెడల మీరు జైలుకి వెళ్లాల్సి వస్తుంది. మీ సంతోష సమయం పోలీస్ స్టేషన్ లో గడపకండి.స్త్రీలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించండి,మీ ఆనందం కోసం ఇతరులకు ఇబ్బంది కల్గించవద్దు.మీరు షాపింగ్ కి లేదా ఏదైనా ఈవెంట్ కి వెళ్ళినప్పుడు పోలీస్ సూచనలు పాటిస్తూ, ట్రాఫిక్ కి ఇబ్బంది కలగకుండా చూసుకోగలరు.

# రైతులకు న్యాయమైన రుణ పరిమితులు నిర్ణయించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)

ఇంచార్జ్ చైర్మన్, జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పంటల సాగు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అవసరమైన చోట సవరణలు చేసేందుకు సమావేశంలో చర్చ జరిగింది.ముందుగా డిసిసి బ్యాంక్ పర్సన్ ఇంచార్జ్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బ్యాంకు సందర్శించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బ్యాంకు కార్యకలాపాలను పరిశీలించారు. 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, సాగునీరు, కూలీల ఖర్చులు, యంత్రాల అద్దె వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని భూమి స్థాయిలో రైతులకు మేలు చేసే విధంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఉండాలని అన్నారు.రైతు వ్యవసాయంలో లాభ



సాటిగా ప్రోత్సహించేందుకు అవసరమైన ఆర్థిక భరోసా కు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిజమైన ఖర్చులకు అనుగుణంగా ఉండాలన్నారు.సహకార బ్యాంకులు రైతుల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవశ్యకత ఉందని స్పష్టం చేశారు.వరి, జొన్న, మక్క, రాగి, సజ్జలు, గోధుమలు, మైనర్ మిల్లెట్స్, రెడ్ గ్రామ్ , మినుములు, పెసర్లు, వేరుశనగ, పత్తి, నువ్వులు, చెరుకు, పలు రకాల పూలు, కూరగాయలు, పైకప్పు తోటలు, వివిధ రకాల పండ్లు, సాగు తోటలు, తదితర పంటలకు ప్రాంతాల సాగు పరిస్థితులు, పాడి పశువులు, ఆవులు, గొర్రెలు, మేకలు పెంపకంపై ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల అనుగుణంగా ప్రతిపాదిత రుణ పరిమితులపై విస్తృతంగా చర్చ జరిగింది. అవసరమైన చోట సవరణలు చేసి తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.రైతు వ్యవసాయం చేసేందుకు ధైర్యంగా ముందుకు వచ్చేందుకు, దానికి అవసరమైన ఆర్థిక భరోసా ఇవ్వాల్సిన బాధ్యత సహకార బ్యాంకులది అన్నారు .రైతు నష్టపోకుండా ప్రతి రూపాయి రుణం రైతు పంటకు, రైతు అభివృద్ధికి గుర్తింపుగా మారాలని, పారదర్శకంగా, సమయానికి రుణాలు అందించడం ద్వారా రైతుల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ తెలిపారు.సమావేశంలో బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. రైతులకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా తుది నిర్ణయాలు తీసుకుని ప్రతిపాదనలు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో డిసిసి బ్యాంక్ సీఈఓ వెంకట అదిత్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** తెలంగాణలో గతంలో ఇచ్చిన మీడియా అక్రెడిటేషన్ కార్డుల కంటే అధికంగానే ఇస్తామని, నిజమైన జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అక్రిడిటేషన్ల జీవో 252 విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,ఏదైనా పొరపాట్లు ఉంటే త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశమై సవరిస్తామని అన్నారు.మంగళవారం రాష్ట్రసచివాలయంలో తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(టీజేఏ జేఏసీ) నాయకులు మంత్రి పొంగులేటిని కలిసి జీవో 252 సవరణతో పాటు జర్నలిస్టుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని,అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మరో జీవో తెస్తామని అన్నారు. డెస్క్ లో పనిచేసే వారికి, ఫీల్డ్ లో పనిచేసే జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252 మార్గదర్శకాలలోని అభ్యంతరాలను నోటిఫికేషన్ కు ముందు సవరించాలని, చిన్న పత్రికలు, కేబుల్ ఛానెళ్లతో పాటు ఎంపానల్మెంట్ కాకుండా ఉన్న ఇతర పత్రికలకు సంబంధించిన ప్రతి జర్నలిస్టుకు వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని వారు కోరారు.రెండు కార్డుల వ్యవస్థకు బదులుగా, డెస్క్ జర్నలిస్టులకు కూడా జర్నలిస్టుల మాదిరిగానే ఒకే అక్రిడిటేషన్ కార్డు వ్యవస్థను కొనసాగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయిందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు 15 సంవత్సరాల సీనియారిటీ నిబంధన అసంబద్ధమని, ఈ నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని, ఇందుకు కోసం వెంటనే ఆయా విభాగాలకు అధికారిక ఆదేశాలు జారీ చేయాలని కోరారు.జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు బీమా సౌకర్యం కల్పించాలని,60 సంవత్సరాలు నిండిన జర్నలిస్టులందరికీ నెలకు రూ. పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టులకు దేశవ్యాప్తంగా రైల్వే ఫ్రీ పాసులు కల్పించాలని,అదేవిధంగా జర్నలిస్టుల వాహనాలకు టోల్ గేట్ ఫీజు నుంచి మినహాయింపు సదుపాయం కల్పించాలని వారు మంత్రిని కోరారు. మంత్రిని, కమీషనర్ ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్లు మామిడి సోమయ్య(టీడబ్ల్యూజేఎఫ్), కే.కోటేశ్వర్ రావు(ఏడబ్ల్యూజేఏ), అనంచిన్ని వెంకటేశ్వరరావు(టీజే ఎస్ఎస్), పులిపలుపుల ఆనందం(ఐఎఫ్ డబ్ల్యూజే), రావికంటి శ్రీనివాస్(డబ్ల్యూజేఐ), గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్, కీర్తి సంతోష్ రాజు తదితరులున్నారు.

## నిబంధనల ప్రకారం సర్వే పనులను జనవరి 15 వరకు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఏడి రెగ్యులర్ గా రివ్యూ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అందించిన దరఖాస్తులలో అధికంగా తిరస్కరించడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల దరఖాస్తులను తిరస్కరించే సమయంలో తప్పనిసరిగా కారణాలు ఉండాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.సర్వేకు సంబంధించి మండలాలకు వచ్చిన పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. చిన్న, చిన్న కారణాలకు ప్రజలు అందించిన దరఖాస్తులను తిరస్కరించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.మండలాల్లో పెండింగ్ ఉన్న భూ సర్వే పనులు జనవరి 15 వరకు నిబంధనల వరకు ప్రకారం పూర్తి చేయాలని, ప్రస్తుతం భూ భారతిలో ఉన్న ప్రభుత్వ భూమి ఫీల్డ్ పొజిషన్ డి మార్క్ చేసి ఎంత అందుబాటులో ఉందో వివరాలు కూడా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి మండలంలో ప్రభుత్వ భూమి అధికంగా ఉన్న 5 సర్వే నెంబర్లను తీసుకొని డి మార్క్ చేసి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి పరిధి, విస్తీర్ణం, ఆక్రమణలకు గురైన భూమి, ఎంత ఆక్రమణకు గురైంది వాటి వివరాలతో జనవరి లోగా సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, మండల సర్వేయర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఏసీపీ వసుంధర యాదవ్



**కల్లూరు డిసెంబర్ 30 ప్రజాజ్యోతి** కల్లూరు మరియు విమ్ బంజర పోలీస్ స్టేషన్లను కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సందర్శించారు. మంగళవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఏసీపీ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, సి సి టి ఎం ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. పోలీసులు దృష్టి రౌడీషీటర్లు, హిస్టరీ దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని సెక్టర్ పోలీస్ ఆఫీసర్లకు సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ..వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. పాత నేరస్థుల కదలికలను నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ముత్తు. లింగయ్య, ఎస్సై లు డి. హరిత, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక



**కారేపల్లి,డిసెంబర్ 30, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో సీనియర్ జర్నలిస్ట్ దమ్మాలపాటి కృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కాగా మూడోసారి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా భీమవరపు శ్రీనివాసరావు,కోశాధికారిగా పాలిక శ్రీనివాస్ తో పాటు ప్రధాన కార్యదర్శిగా బానోతు బాలు నాయక్, ఉపాధ్యక్షులుగా ధరావత్ కళ్యాణ్, సహాయ కార్యదర్శిగా కేతిమల్ల సురేష్, గౌరవ అధ్యక్షుడిగా తేల్ల శ్రీనివాసరావులను సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన ప్రెస్ క్లబ్ గా ఎన్నికైన వారిని తోటి జర్నలిస్టులు అనంతారపు వెంకటాచారి,పగడాల నాగేశ్వరరావు,కొండపల్లి వెంకటేశ్వరరావు,ముక్క వెంకటేశ్వర్లు,కొత్తూరు శ్రీనివాసరావు ఏపూరి లక్ష్మినారాయణ,బాధవత్ రాము నాయక్లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ చైర్మన్ భీమవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పాలకుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మి వెంకన్న



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:**మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక 28వ డివిజన్ ప్రకాష్ నగర్ లో ఉన్న శ్రీ క్రిష్ణా మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మీవెంకన్న, ఈ సందర్భంగా మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినమున ముక్కోటి దేవతల దీవెనలు మనపై ఉంటాయని ఈ ముక్కోటి పండగ పర్వదినమున మీతో పాలుపంచుకున్నందుకు నాకు ఎంతో ఆనందంగా సంతోషంగా ఉందని ఆ దేవుని దీవెనలు మీకు ఎల్లవేళలా ఉంటాయని నా మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రికార్డును పరిశీలించిన ఎంపీఓ రవీంద్ర ప్రసాద్



**కారేపల్లి, డిసెంబర్ 30, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని రావోజీ తండా గ్రామపంచాయతీ రికార్డులు మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ మంగళవారం తనికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకొని ఉండాలని ఆదేశించారు. ప్రస్తుతం సర్పంచ్ అధ్యక్షతన, పాలకవర్గ సభ్యులచే, సమావేశం ఏర్పాటు చేసుకొని, ఉన్న నిధుల ప్రకారం చేసే పనులు నిబంధనల ప్రకారం గుర్తించి తీర్మానం చేసుకొని పనులు పూర్తి చేయాలని అన్నారు. ఇంటి పన్నులు, వంద శాంతం వసులు చేయాలని ఆదేశించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచి ని ఎంపీఓ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య బాలు, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, ఎంపీడబ్ల్యూ సిబ్బంది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



**కారేపల్లి,డిసెంబర్ 30, ప్రజా జ్యోతి :**వైకుంఠ ఏకాదశి వేడుకలు మంగళవారం సింగరేణి మండల వ్యాప్తంగా కన్నుల పండుగగా జరిగాయి.మండల కేంద్రం కారేపల్లి లో గల సంత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకొని తరించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిట కిట లాడింది.వివిధ ప్రాంతాల నుండి పలువురు ప్రముఖులు,భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.దేవాలయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.అదేవిధంగా ఆలయ సిబ్బంది పలువురిని సన్మానించారు.అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సదుపాయాలతో స్వామివారిని దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించినందుకు ఆలయ సిబ్బంది మొడుమోహన్ ను భక్తులు, గ్రామస్తులు అభినందించారు.

## సింగరేణి గ్రామపంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ వితరణ

- **దాత డేవిడ్ పాల్- మేరీ దంపతులు**



**కారేపల్లి,డిసెంబర్ 30, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి గ్రామపంచాయతీ ప్రజల అవసరార్థం, మరణించిన వారి కోసం డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్ ను కారేపల్లికి చెందిన రగులుతున్న అగ్ని మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డేవిడ్ పాల్–మేరి దంపతులు తన సొంత నిధులతో మంగళవారం సింగరేణి గ్రామపంచాయతీకి వితరణగా అందజేశారు.స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ తో పాటు పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు డేవిడ్ పాల్ దంపతులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన పలువురు మాట్లాడుతూ దాత డేవిడ్ పాల్ ను అభినందిస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికి మరింత మంది ముందుకు వచ్చి పేద ప్రజల అవసరాలు తీర్చడానికి దోహదపడే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.దాత పాస్టర్ డేవిడ్ పాల్ మాట్లాడుతూ మరణించిన తమ కుటుంబ సభ్యుల కోసం గ్రామపంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా తెలియజేశారు.ఇటీవల తన తండ్రి అనారోగ్యంతో మరణించడంతో ఆయన పేరుతో గండుమల్ల నారాయణ జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్స్ అందించడం జరిగిందని తెలిపారు.పల్లె ప్రాంతాలలో ఎవరైనా వ్యక్తి చనిపోతే ఫ్రీజర్ బాక్స్ అందుబాటులో లేక,సుదూర ప్రాంతాలలో ఉన్న వారి బంధువులు కడసారి చూపుకు నోచుకోకుండానే అంత్యక్రియలు జరుగుతున్నాయన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలని ఉద్దేశంతో తన సొంత గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ ను వితరణగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- **ఎస్ ఐ, బి. గోపి.**




**కారేపల్లి, డిసెంబర్ 30, ప్రజా జ్యోతి:** నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీ సుకుంటామని కారేపల్లి ఎస్సై బైరి గోపి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఆయన మాట్లాడు తూ మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ డి సెంబర్ 31 రాత్రి రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని, ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దన్నారు. మద్యం దుకాణదారులు నిర్ణీత సమయం వరకే విక్రయాలు చేయాలన్నారు. అర్ధరాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దు,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్న ట్లు అయన తెలిపారు. స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## శారీరక, మానసిక ఆరోగ్యానికి, సమానత్వానికి ప్రతీక క్రీడలు

- **సర్పంచ్ టోనీ.**



**కారేపల్లి, డిసెంబర్ 30, ప్రజా జ్యోతి :** శారీరక మానసిక ఆరోగ్యానికి, మానవ సమానత్వానికి క్రీడలు దోహదపడతాయని సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షిక ఆటల పోటీల కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ కే.వి జయకుమారి నేతృత్వంలో ఆయన ప్రారంభించారు. సర్పంచ్ తో పాటు కళాశాల శ్రేయోభిలాషులు నేదునూరి నరేష్,సురేష్ బాబ్,మొరిశెట్టి శంకర్ నారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కబడ్డీ ,వాలీబాల్, క్రికెట్ ,షటిల్, టెన్నికాయిట్ క్యారం బోర్డు, చెస్ మొదలైన ఆటల పోటీలు విద్యార్థులకు మానసిక శారీరిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు.కారేపల్లి ప్రభుత్వ కళాశాలలో ఎంతో మంది విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారని,వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువుల్లో, క్రీడల్లో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది శేషు ,సుధారాణి,దుర్గాప్రసాద్,పార్థసారథి,లక్ష్మినారాయణ,యాకయ్య,రాంబాబు,బాబురావు,ఖాసీం,వనిత,రమ,పాషా,సుధీర్,కృష్ణవేణి,మదార్,ఖాదర్ అలీ,బోధనేతర సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ సూచనలు

- **ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ**




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలు కు టుంబ సభ్యులతో సంతోషం గా జరుపుకోవాలని కోరుతున్నాము.యువకులు బైక్ మీద ప్రమాదకర విన్యాసాలు, అతి శబ్దాలు చేస్తూ ప్రజలను భయబ్రాంతులకి గురి చేయవద్దు.చేస్తే అటువంటి వాహనాలు స్వాధీనం చేసుకోబడతాయి.నూతన సంవత్సర వేడుకలు కారణంగా ఖమ్మం నగరం నలు మూలల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుంది. కావున మద్యం సేవిం చి వాహనాలు నడపరాదు.మద్యం సేవించి పోలీసులకి దొరికిన యెడల మీరు జైలుకి వెళ్లాల్సి వస్తుంది. మీ సంతోష సమయం పోలీస్ స్టేషన్ లో గడపకండి.స్త్రీలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించండి,మీ ఆనందం కోసం ఇతరులకు ఇబ్బంది కల్గించ వద్దు.మీరు షాపింగ్ కి లేదా ఏదైనా ఈవెంట్ కి వెళ్ళినప్పుడు పోలీస్ సూచనలు పాటిస్తూ, ట్రాఫిక్ కి ఇబ్బంది కలగకుండా చూసుకోగలరు.